రహదారులను ఆక్రమించి..!

- నిర్మాణాలు చేపడుతున్న దుకాణదారులు
- కుచించుకుపోతున్న రహదారులు
- రాకపోకలకు అవస్థలు
- చోద్యం చూస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్ : నగర శివారు కొత్తూరులోని పలు ప్రాంతాల రహదారులు ఆక్రమణలతో రోజు రోజుకూ కుచించుకుపోతున్నాయి. రహదారులకు ఇరువైపులా దుకాణదారులు, హోటళ్ల నిర్వాహకులు రహదారులను ఆక్రమించి ముందుకువస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత కొంతకాలం క్రితం నెల్లూరు–పొదలకూరు రోడ్డుపై కొత్తూరు వద్ద రోడ్డు విస్తరణ పనుల సమయంలో ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత మరలా యథావిధిగా దుకాణదారులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. 30వ డివిజన్‌లోని దశరథరామిరెడ్డినగర్‌కు వెళ్లే 30 అడుగుల రహదారిని ఓ క్యాటరింగ్ హోటల్ నిర్వాహకులు ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ రోడ్డు ప్రధాన ముఖద్వారం వద్ద క్యాటరింగ్ హోటల్ నిర్వాహకులతోపాటు పలువురు వ్యక్తులు రోడ్డు స్థలాన్ని ఆక్రమిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు కుచించుకుపోవడంతో ప్రస్తుతం 15 అడుగులకు చేరుకుంది. రోజురోజుకూ ఆక్రమణలు పెరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆక్రమణలపై పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.


దశరథరామిరెడ్డినగర్ ముఖద్వారం వద్ద రహదారిని ఆక్రమించిన దృశ్యం

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



మా కాలనీ ముఖద్వారం వద్ద క్యాటరింగ్ హోటల్ నిర్వాహకులు యథేచ్ఛగా రోడ్డు స్థలాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారు. రహదారిపైనే భారీ ఎత్తున కట్టెలు నిల్వలు ఉంచుతున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. అధికారులు దృష్టి సారించి ఆక్రమణలను తొలగించాలి.

– పి.పద్మావతమ్మ, దశరథరామిరెడ్డినగర్

విచారించి చర్యలు తీసుకుంటాం

దశరథరామిరెడ్డినగర్‌లో ప్రధాన రహదారి ఆక్రమణపై విచారించి చర్యలు తీసుకుంటాం. రహదారుల స్థలాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధం. ప్రజల అవసరాల మేరకు రహదారుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.

– దేవికుమారి, డిప్యూటీ సిటీ ప్లానింగ్ ఆఫీసర్, నగరపాలక సంస్థ

క్లుప్తంగా

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


జెండాను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నెల్లూరు(టౌన్): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 49 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం స్థానిక మాగుంటలేవుట్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయ జీవితాల్లో అనేక మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, కోశాధికారి మురళీధరరావు, కార్యదర్శి సురేంద్ర, సీనియర్లు భాస్కర్, గోపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమాజంలో వెనుకబడిన తరగతికి చెందిన నాయీబ్రాహ్మణ కులానికి చెందిన వ్యక్తిని కించపరిచేలా మాట్లాడిన తాడిపత్రి చెందిన టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు వేలూరు రంగారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. కులాన్ని కించపరిచేలా మాట్లాడడం సరికాదని తెలిపారు.

కాంపోజిట్ తెలుగును కొనసాగించాలి

నెల్లూరు(టౌన్): ఈ విద్యా సంవత్సరంలో కాంపోజిట్ తెలుగును కొనసాగించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. గురువారం స్థానిక పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఎఫ్ఏ-1 పూర్తి కావడంతో పాటు సిలబస్ కూడా కాంపోజిట్ తెలుగు ప్యాట్రన్‌లోనే జరిగిందన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో కంపోజిట్ తెలుగును రద్దు చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. ఈ విషయంపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

ఆలయ ఇన్‌చార్జి ఈఓగా మల్లికార్జునరెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని మూలాపేట సీఏఎం స్కూల్ రోడ్డులో ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయ ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఈఓ బొగ్గల మల్లికార్జునరెడ్డిని నియమించినట్లు ఆ ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్.సి.బాలాజీసింగ్ గురువారం తెలిపారు. ఈ మేరకు దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఇప్పటి వరకు ఈ ఆలయ ఇన్‌చార్జి ఈఓగా విధులు నిర్వహిస్తున్న కుడారి పెంచలవరప్రసాదు ప్రకాశం జిల్లా ఉలవపాడుకు బదిలీ అయ్యారు.

13న బ్యాడ్మింటన్ టోర్నీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో యూరో కిడ్స్ పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 13న స్థానిక ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో నెల్లూరు–తిరుపతి జిల్లాల బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఆలపాటి సంధ్యాదేవి తెలిపారు. గురువారం స్థానిక బీవీనగర్‌లోని ఆ పాఠశాలలో టోర్నీకి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ టోర్నీ అండర్–11, 15 బాలబాలికలు, 45 నుంచి 45 సంవత్సరాల పైబడిన పురుషులకు సింగిల్స్, డబుల్స్‌లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎండీయూ ఆపరేటర్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): నిబంధనలకు విరుద్ధంగా వినియోగదారుల నుంచి రేషన్‌ను కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న ఎండీయూ ఆపరేటర్‌పై విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారుల బృందం గురువారం వెంగళరావ్‌నగర్‌లోని ఏ–బ్లాక్‌లో ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో ఉండాల్సిన సరుకుల కన్నా రూ.54 వేల విలువ చేసే 1,150 కేజీల బియ్యం, 204 ప్యాకెట్ల పంచదార, 90 ప్యాకెట్ల గోధుమపిండి ఉండడంతో వాటిని అధికారులు సీజ్ చేశారు. ఎండీయూ ఆపరేటర్ సుల్తాన్‌బాషాను వివరణ కోరగా కార్డుదారుల నుంచి రేషన్ సరుకులు కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆపరేటర్‌పై కేసు నమోదు చేయాలని నెల్లూరు రూరల్ సీఎస్ డీటీ కె.చంద్రలీల వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఎన్జీఓ నాయకులు



నెల్లూరు(పొగతోట): కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను నెల్లూరులో ఏపీ ఎన్జీఓ నాయకులు గురువారం కలిసి ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే ఏపీ ఎన్జీఓ 21వ రాష్ట్ర మహాసభలకు ఆహ్వానించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ ఎన్జీఓ నాయకులు మన్నేపల్లి పెంచలరావు, నాయుడు వెంకటస్వామి, బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఆంజనేయవర్మ, రామకృష్ణ, పెంచలయ్య, విజయకుమార్ ఉన్నారు.

నులిపురుగుల మాత్రలను వినియోగించాలి

నెల్లూరు(టౌన్): ప్రతి విద్యార్థి నులిపురుగుల మాత్రలను తప్పకుండా వినియోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల మాత్రల ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పెంచలయ్య మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనత ఉంటుందని, ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, డిప్యూటీ డీఈఓ లక్ష్మీప్రసన్న, డాక్టర్ సుధీర్, హెచ్ఎం జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్

బీచ్‌లను ఎంపిక చేయండి


మాట్లాడుతున్న డీఆర్ఓ వెంకటనారాయణమ్మ


హాజరైన అధికారులు

- జిల్లా టూరిజం కౌన్సిలింగ్ సమీక్షలో డీఆర్వో

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో తీరప్రాంత పర్యాటక మేనేజ్‌మెంట్ ప్లాన్ కింద ప్రతిపాదించిన 63 బీచ్ పాయింట్లలో అనువైన బీచ్ పాయింట్లు ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం కోసం జిల్లా టూరిజం కౌన్సిల్ మీటింగ్ నిర్వహించారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్ అధ్యక్షతన గురువారం రాత్రి కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాగణంలో జరిగిన సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ టూరిజంను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సముద్రంపై ఆధారపడి జీవించే మత్స్యకారులకు, తీరప్రాంత అడవులకు, సముద్ర జీవులకు ఇబ్బంది కలుగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 63 బీచ్ పాయింట్లు గుర్తించి బీచ్‌ల ఏర్పాటుకు అవి అనుకూలంగా ఉన్నాయా లేదా అనేది సంబంధిత శాఖల అధికారుల పరిశీలన కోసం పంపినట్లు తెలిపారు. సమావేశంలో ఫారెస్ట్ పొల్యూషన్ కంట్రోల్, ఇండస్ట్రీస్, ఫిషరీస్, పోలీసు శాఖల అధికారులు బీచ్‌ల ఏర్పాటుపై చర్చించారు. తీరప్రాంతంలోని సర్పంచ్‌లు, కార్యదర్శుల అభిప్రాయాలను తీసుకున్నారు. సుమారు 12 నుంచి 16 బీచ్ పాయింట్లకు ఆమోదం లభించే అవకాశం ఉందని రీజినల్ డైరెక్టర్ తెలిపారు. సమావేశంలో చర్చించిన అంశాలు కలెక్టర్‌కు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బాలికను బెదిరించి లోబరుచుకుని..

- నిందితునిపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ కామాంధుడు తల్లి, అన్నను చంపుతానని బెదిరించి బాలికను లోబరుచుకుని గర్భిణిని చేశాడు. గమనించిన తల్లి బాలికను నిలదీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాలిక ఫిర్యాదు మేరకు కోవూరు పోలీసులు తొలుత జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన ప్రదేశం నెల్లూరు వనంతోపు కావడంతో కేసును వేదాయపాళెం పోలీసులకు బదలాయించారు. పోలీసుల సమాచారం మేరకు.. కోవూరు మండలంలో ఓ మహిళ తన కుమారుడు, కుమార్తెతో కలిసి జీవిస్తోంది. ఆమె పాచిపనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. కుమార్తె ప్రస్తుతం ఏడో తరగతి చదువుతోంది. అనారోగ్యం కారణంగా నాలుగు నెలలుగా బాలిక ఇంటి వద్దనే ఉంటోంది. బాలిక తల్లి ప్రతి రోజూ నెల్లూరులో పనులకు వెళ్లేది. బాలిక ఇంటి ముందు చైతన్య అనే వ్యక్తి తన భార్యపిల్లలతో ఉంటున్నాడు. బాలిక పిల్లలతో ఆడుకునేందుకు చైతన్య ఇంటికి వెళ్లేది. బాలికను ఎలాగైనా లొంగదీసుకోవాలని అతడు నిర్ణయించుకున్నాడు. బాలిక తల్లి ఫోన్ ఇంట్లో ఉండడంతో ఆమె నంబర్ సేకరించి నిత్యం ఫోన్ చేసి బాలికను నెల్లూరుకు రమ్మని పిలిచేవాడు. ఆమె నిరాకరించడంతో నీ తల్లి, అన్నను చంపేస్తానని బాలికను బెదిరించేవాడు. దీంతో బెదిరిపోయిన బాలిక నెల రోజుల క్రితం బస్సులో నెల్లూరుకు వచ్చింది. చైతన్య ఆమెను ఆటోలో ఎక్కించుకుని వనంతోపులోని తన స్నేహితుని గదికి తీసుకెళ్లి ఆమెపై లైంగికదాడికి చేశాడు. పలుమార్లు ఇలాగే చేశాడు. ఇటీవల బాలికలో మార్పులను గమనించిన తల్లి గట్టిగా నిలదీయడంతో చైతన్య అకృత్యాలను బయటపెట్టింది. ఆమె గర్భిణి అని తేలింది. ఈ మేరకు బాధిత బాలిక కోవూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంకరంబాడి సుందరాచారికి నివాళి

వెంకటాచలం: మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీత రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతిని గురువారం మండలంలోని సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ సుందరాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ మా తెలుగుతల్లికి మల్లె పూదండ గీతంతో సుందరాచారి రాష్ట్ర వైభవాన్ని చాటారన్నారు.


నివాళులర్పిస్తున్న డైరెక్టర్ తదితరులు

రాహుల్ సొంత ఇమేజ్ సాధించారు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాహుల్‌గాంధీ కుటుంబ వారసత్వంగా ఎదగకుండా ఆయన తన సొంత ఇమేజ్‌ను సాధించారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు డాక్టర్ యశోధర అన్నారు. నగరంలోని ఆమె కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన జోడో యాత్రలో వచ్చిన విశేష స్పందనను చూసిన ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ పెద్దలు అతనిని ప్రజల నుంచి దూరం చేసేలా కుట్ర చేశారని ఆరోపించారు. రాహుల్‌గాంధీపై ఉన్న కేసుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన సందర్భంగా నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. సమావేశంలో కేంద్ర అగ్రికల్చర్ మాజీ డైరెక్టర్ కనకట్ల రఘురాంముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున, పవన్‌కుమార్, పుష్పరాజ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

'మైండ్‌గేమ్' చిత్రాన్ని ఆదరించండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చిత్ర బృందం

నెల్లూరు సిటీ: 'మైండ్‌గేమ్' చిత్రాన్ని సినీ ప్రేక్షకులు ఆదరించి విజయవంతం చేస్తారని నమ్మకం ఉందని చిత్ర దర్శకుడు కిషోర్ శ్రీకృష్ణ పేర్కొన్నారు. ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్లను నగరంలోని మాగుంటలేవుట్‌లోని శ్రయ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషోర్ శ్రీకృష్ణ మాట్లాడుతూ ఎంవీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై కప్పముల సమర్పణలో 'మైండ్‌గేమ్' చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుందన్నారు. సెప్టెంబర్ 10వ తేదీన వీఆర్సీ గ్రౌండ్స్‌లో ఆడియో ఫంక్షన్ చేయనున్నట్లు తెలిపారు. చిత్రంలో హీరోగా శ్రీరామ్, హీరోయిన్లుగా విజయలక్ష్మి, మిధునప్రియ, అలాగే జబర్దస్త్ అప్పారావు, ఉప్పల్‌బాలు, కునుపాటి వాసు తదితరులు నటించారని తెలిపారు. తండ్రీకొడుకుల మధ్య అనుబంధాన్ని చిత్రంలో చూపించామని, నెల్లూరు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ చేశామని తెలిపారు. కునుపాటి శ్రీలక్ష్మి నిర్మాతగా వ్యవహరించగా మ్యూజిక్ డైరెక్టర్‌గా మహేష్, కెమెరామెన్‌గా బాలు పనిచేశారన్నారు.

రేపు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాలాజీనగర్ మెయిన్‌రోడ్డు ఉగాదిసెంటర్ వద్ద పాతరైస్ మిల్లు ప్రాంగణంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు సింహపురి ధార్మిక సంస్థ అధ్యక్షుడు ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ తెలిపారు. పాతరైస్‌మిల్లు ప్రాంగణంలో గురువారం కల్యాణోత్సవం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

పిల్లల్ని బాగా చదివించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ మధుసూదన

ముత్తుకూరు: పిల్లలను పనులకు పంపొద్దని, వారిని బాగా చదివించాలని ఎంఈఓ మధుసూదన సూచించారు. ముత్తుకూరు పంచాయతీలోని చలివేంద్ర కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. బడి బయట పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. పిల్లలు వాటిని సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో రాణించాలన్నారు. సమయం వృథా చేయడం, చెడుస్నేహాలకు అలవాటు పడడం వల్ల అధిక నష్టాలు ఉంటాయన్నారు. పిల్లలను పనులకు తీసుకెళ్లకుండా, పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలను సాధించాలి

- డ్వామా పీడీ వెంకట్రావ్


సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకట్రావ్ తదితరులు

నెల్లూరు రూరల్ : ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించాలని డ్వామా పీడీ వెంకట్రావ్ సిబ్బందికి సూచించారు. గురువారం నగరంలోని నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ మండలంలో దాదాపుగా 90 శాతం మేరకు ఉపాధి హామీ పనుల లక్ష్యాలను సాధించినట్లు తెలిపారు. రికార్డుల నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు రూ.2.75 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. సిమెంటు రోడ్లు, కాలువలు, రైతుభరోసా కేంద్రాల భవనాలు, సచివాలయాల భవనాల నిర్మాణాలకు రూ.4.46 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. మిగతా పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ శ్రీహరి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, పలువురు మండలస్థాయి అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి


మాట్లాడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. ఓటర్ల జాబితా సవరణపై నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత నెల 21వ తేదీ నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ప్రస్తుత ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు వారికి సంపూర్ణంగా సహకరించాలని సూచించారు. పార్టీలు సహకరించడం ద్వారా పరిపూర్ణమైన ఓటరు జాబితా తయారవుతుందన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులు, ఈ ఏడాది జనవరి ఒకటో తేదీకి 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఒకే ఇంట్లో 10 మందికి పైగా ఓటర్లు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా పోలింగ్ స్టేషన్ల మార్పు, ఓటర్ల జాబితా సవరణలో ఏవైనా సమస్యలు ఉంటు ఏఈఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఒక ఇంట్లోని కుటుంబసభ్యుల ఓట్లు ఒకే బూత్‌లో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జూడో రాష్ట్రస్థాయి పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల జూనియర్, సీనియర్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనం రంగమయూర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడ్డ కొత్త జిల్లాల వారీగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 350 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో తలపడుతారని తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. జాతీయస్థాయి పోటీలకు హాజరయ్యే జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి వెంకట శశిధర్, ఉపాధ్యక్షుడు ముసావీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మంత్రి ధర్మానను కలిసిన కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్


మంత్రి ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్


మంత్రి ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును గురువారం కలెక్టర్ ఎం.హరినారాయణన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మకూరులో నిర్వహించే రెవెన్యూ సదస్సుతోపాటు జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రిని నెల్లూరులోని ఓ హోటల్‌లో కలెక్టర్ కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి జిల్లాకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

నెల్లూరు(పొగతోట): రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నెల్లూరుకు వచ్చిన మంత్రిని ఆమె కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పలు అంశాలపై చర్చించారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపికలు

నెల్లూరు(టౌన్): నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో గురువారం రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ అండర్–19 పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 12, 13 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని ఫెన్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి గురవయ్య తెలిపారు. ఈ ఎంపికలకు ముఖ్యఅతిథులుగా కళాశాల అధ్యాపకులు రమణారెడ్డి, శ్రీనివాసులు, స్టేట్ అబ్జర్వర్ అశోక్‌బాబు, ఫెన్సింగ్ కోచ్ ప్రసాద్ పాల్గొన్నారు.


క్రీడాకారులను ఎంపిక చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు